నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శనివారం 22-5-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 244 పేజీలు: 4 వెల: రూ.1/-

అప్రమత్తతో బ్లాక్ ఫంగస్‌కు అడ్డుకట్ట : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మే 21: కొవిడ్-19 సెకండ్ వేవ్ వ్యాప్తి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం తన పార్లమెంట్ నియోజకవర్గం వారణాసికి చెందిన డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించారు. కొవిడ్-19తో పాటు ప్రధాన సవాల్ గా ముందుకొచ్చిన బ్లాక్ ఫంగస్ నిరోధానికి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రధాని కోరారు. కరోనా మహమ్మారి సమసిపోయేవరకూ ప్రజలు సేదతీరరాదని స్పష్టం చేశారు. కొవిడ్-19పై మనం పోరాడుతుండగానే బ్లాక్ ఫంగస్ రూపంలో మరో సవాల్ ఎదురైందని దీన్ని సమర్ధంగా ఎదుర్కొనేందుకు మనం జాగ్రత్తలు పాటిస్తూ సంసిద్ధం కావాలని అన్నారు. కరోనా కట్టడిలో వారణాసి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సేవలను ప్రధాని ప్రశంసించారు. తక్కువ సమయంలోనే నగరంలో ఆక్సిజన్ పడకలు, ఐసీయూ పడకలను పెద్ద సంఖ్యలో విస్తరించారని కొనియాడారు.

ఢిల్లీలో 197 బ్లాక్ ఫంగస్ కేసులు నమోదు : ఆరోగ్యమంత్రి సత్యేందర్ జైన్

న్యూఢిల్లీ, మే 21: దేశ రాజధాని ఢిల్లీల్లో ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాల్లో 197 బ్లాక్ ఫంగస్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ మంత్రి సత్యేందర్ జైన్ శుక్రవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొవిడ్ చికిత్స కోసం స్టెరాయిడ్లు తీసుకోవాలని, వైద్యుల సూచన మేరకు వాడాలని, ప్రొఫెషనల్‌ను సంప్రదించకుండా వాడడం సరికాదన్నారు. బ్లాక్ ఫంగస్ రెండు కారణాలతో సోకుతుందని.. రక్తంలో షుగర్ లెవల్స్ పెగరడం వల్ల, స్టెర్టాయిడ్ల వాడకంతోనని తెలిపారు. వైద్యుల సలహా మేరకే తీసుకోవాలని సూచించారు. ఫంగస్ మట్టిలో, కుళ్లిపోయిన వస్తువుల్లో కనిపిస్తుందన్నారు. ఇది ఆరోగ్యకరమైన వ్యక్తిపై ప్రభావం చూపదన్నారు.

స్టెరాయిడ్స్ వాడి, మానివేసిన వారంతా కనీసం వారం రోజులు ఇల్లు విడిచి వెళ్లొద్దని సూచించారు. ఇదిలా ఉండగా.. దేశ రాజధానిలో కొవిడ్-19 కేసులపై స్పందిస్తూ.. కొవిడ్ పాజిటివిటీ రేటు ప్రస్తుతం 5.5శాతంగా ఉందని తెలిపారు. కొత్తగా 3,231 కేసులు నమోదయ్యాయని తెలిపింది. రోజువారి కేసులు 28వేల నుంచి మూడువేలకు పడిపోయాయని.. 36శాతం వరకు పెరిగిన పాజిటివిటీ రేటు ప్రస్తుతం 5.5శాతానికి తగ్గిందన్నారు. ప్రజలు వైరస్ తగ్గుముఖం పట్టిందని, తేలిగ్గా తీసుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కొవిడ్ ప్రవర్తనా నియమాలు పాటించాలని సూచించారు. 18-44 మధ్య వయస్సు వారికి టీకాలు వేసేందుకు అందుబాటులో లేవని, త్వరలోనే డోసులు వస్తాయని మంత్రి పేర్కొన్నారు.

అనంతగిరిలో కొవిడ్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తాం

వికారాబాద్ మే 21 : సీఎం కేసీఆర్ ఆదేశాలతో అనంతగిరిలో కొవిడ్ హాస్పిటల్ ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. అనంతగిరిలోని టీబీ హాస్పిటల్‌ను శుక్రవారం మంత్రి సందర్శించారు. అనంతరం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, కలెక్టర్ పౌసుమి బసు, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, జడ్పీ చైవిజయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్లు మోతిలాల్, చంద్రయ్య, జిల్లా వైద్యాధికారి సుధాకర్ షిండే, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజులతో కలిసి కొవిడ్ పై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కరోనాపై అనునిత్యం సమీక్షిస్తూ ఆదేశాలు ఇస్తున్నారని అన్నారు. సీఎం స్వయంగా రెండు రోజుల క్రితం గాంధీ దవాఖాన, నేడు వరంగల్ ఎంజీఎంను సందర్శించి కరోనా రోగులకు మనో ధైర్యం కల్పించారని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బందిని ప్రోత్సహించి వారిలో మరింత ఆత్మస్థైర్యం నింపారన్నారు.

వికారాబాద్‌లో డ్రగ్ స్టోర్‌ను మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు మంత్రి సబితా రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ సెంటర్ త్వరలో ప్రారంభం కానుందని పేర్కొన్నారు. వికారాబాద్ లో నేటి నుంచి సిటీ స్కాన్ 2,500 రూపాయలకే చేయనున్నట్లు తెలిపారు. ప్రయివేట్ హాస్పిటల్స్‌లో ఫీజుల నియంత్రణ కు కలెక్టర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలను వసూలు చేయాలని మంత్రి ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలను ఆదేశించారు. చిన్న పిల్లల కోసం కూడా ప్రత్యేక ఐసోలేషన్ సెంటర్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతగిరిలో 200 పడకల దవాఖానలో ఆక్సిజన్ బెడ్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అనంతగిరిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. చారిత్రాత్మక నేపథ్యం ఉన్న అనంతగిరిలో అన్ని వసతులతో దవాఖాన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఎంపీ రఘురామకృష్ణరాజుకు బెయిల్ మంజూరు

అమరావతి, మే 21: వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. కేసు దర్యాప్తునకు ఆయన సహకరించాలని పేర్కొంది. పిటిషనర్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో మాట్లాడకూడదంది. కనీసం ఒకరోజు ముందు దర్యాప్తు అధికారులు పిటిషనర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించింది. న్యాయవాది సమక్షంలో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావొచ్చని తెలిపింది. దేశద్రోహం కేసులో వైసీపీ నర్సాపురం ఎంపీని సీఐడీ పోలీసులు వారం రోజులక్రితం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తనను సీఐడీ పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని పేర్కొంటూ బెయిల్ కోరుతూ ఎంపీ నేరుగా సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీం ఆదేశానుసారం రాఘురామకృష్ణరాజుని ఆర్మీ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్మీ ఆస్పత్రి నివేదిక అనంతరం బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం రఘురామకృష్ణరాజుకు బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ఎంపీ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది.

సుందర్ లాల్ బహుగుణ మృతి పట్ల మంత్రి ఐకే రెడ్డి సంతాపం

హైదరాబాద్ , మే 21: ప్రముఖ పర్యావరణవేత్త, చిప్కో ఉద్యమ నేత సుందర్‌లాల్ బహుగుణ మృతి పట్ల అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విధ్వంసానికి వ్యతిరేకంగా చిప్కో ఉద్యమం ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు జీవితాంతం కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. పర్యావరణ పరిరక్షణకు సుందర్ లాల్ బహుగుణ చేసిన కృషిని ప్రజలు ఎప్పటికి మరిచిపోరని మంత్రి పేర్కొన్నారు.

జిల్లాల్లో కరోనా పరిస్థితులపై సీఎం కేసీఆర్ సమీక్ష

వరంగల్ అర్బన్ : జిల్లాల్లో కరోనా పరిస్థితులపై రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ పర్యటనలో ఉన్న సీఎం వరంగల్ అర్బన్ కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డీఐజీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతకుక్రితం సీఎం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు. కొవిడ్ రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న చికిత్సల గురించి వాకబు చేసి వారిలో భరోసా నింపారు. అనంతరం వరంగల్ కేంద్ర కారాగారాన్ని సీఎం సందర్శించారు. అక్కడి ఖైదీలతో మాట్లాడి యోగక్షేమాలను కనుక్కున్నారు. ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులను సీఎం పరిశీలించారు.

వరంగల్ సెంట్రల్ జైలును సందర్శించిన సీఎం కేసీఆర్

వరంగల్,మే 21: వరంగల్ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వరంగల్ సెంట్రల్ జైలును సందర్శించారు. జైలులోని ఖైదీలను పరామర్శించి వారి నేర కారణాలను విచారించారు.

జైలులో వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలు తయారు చేసిన పలు రకాల చేనేత ఉత్పత్తులు, ఇతర వస్తువులను సీఎం పరిశీలించారు. అంతకుక్రితం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించిన సీఎం అక్కడి కొవిడ్ రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను, అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడొద్దని భరోసా కల్పించారు.

అనవసరంగా రోడ్లపైకి వచ్చే వాహనాలను సీజ్ చేస్తాం: సీపీ

హైదరాబాద్ , మే 21: నగర ప్రజలంతా లాక్‌డౌన్‌కు సహకరించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ కోరారు. తప్పుడు పత్రాలతో రోడ్లపై తిరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనవసరంగా రోడ్లపైకి వచ్చే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నగరంలో లాక్‌డౌన్ అమలు తీరును సీపీ పరిశీలించారు. ఇందులో భాగంగా దిల్‌సుఖ్‌నగర్ చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో 180 తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. లాక్‌డౌన్ సమయంలో మినహాయింపులు పొందినవారికే తనుమతిస్తామని చెప్పారు. అత్యవసరమైన వారికి ఈ-పాస్‌లు అందిస్తున్నామని అన్నారు.

ఉదయం 10 గంటల తర్వాత అనవసరంగా బయటకు వస్తే వాహనాల్ని సీజ్ చేయాలని డీజీపీ మహేందర్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. లాక్‌డౌన్‌ను పటిష్ఠంగా అమలు చేసేందుకు కాలనీలు, అంతర్గత రహదారుల్లో పోలీసు నిఘా విస్తృతం చేయాలని సూచించారు. లాక్‌డౌన్ ఉల్లంఘించి తిరిగే వాహనాల జప్తు చేయాలన్నారు.

సుందర్ లాల్ బహుగుణ మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్ , మే 21: చెట్ల నరికివేతను వ్యతిరేకిస్తూ చిప్కో ఉద్యమాన్ని (చెట్లను కౌగిలించుకోవడం) నడిపిన, ప్రముఖ పర్యావరణ వాది, శ్రీ సుందర్ లాల్ బహుగుణ మృతి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు.

ఐదు దశాబ్దాలుగా పర్యావరణ సమస్యలపై చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ, అంతరించిపోతున్న వృక్ష, జంతు, పక్షిజాతుల రక్షణకు జీవితాంతం కృషి చేస్తూ తన జీవితాంతం పరితపించిన బహుగుణ మరణం ప్రకృతి, జీవావరణ, పర్యావరణ రంగానికి తీరని లోటని అన్నారు.

ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న

కరోనా రోగులను సీఎం కేసీఆర్ పరామర్శ

వరంగల్ : వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కరోనా రోగులను సీఎం కేసీఆర్ ఇవాళ పరామర్శించారు. కొవిడ్ వార్డుల్లో కలియతిరుగుతూ.. రోగులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు సీఎం కేసీఆర్.

వరంగల్ పర్యటనలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఎంజీఎం దవాఖానకు చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. నేరుగా కోవిడ్ పేషంట్లు ఉన్న ఐసీయూ వార్డులోకి వెళ్లి రోగులను పరామర్శించారు. కోవిడ్ పేషంట్లకు అందుతున్న చికిత్స గురించి తెలుసుకున్నారు.

కరోనాకు భయపడవ ద్దంటూ వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వరంగల్ మట్టెవాడకు చెందిన కరోనా పేషంట్ వెంకటాచారి తనకు వైద్య చికిత్స బాగానే అందుతున్నదని సీఎంకు వివరించారు. కేసీఆర్ జిందాబాద్.. కేసీఆరే నా నిండు ప్రాణం అని ఆయన అన్నారు.ప్రతీ బెడ్ దగ్గరకూ వెళ్లి కరోనా రోగులకు అందుతున్న వైద్య సేవలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎం కేసీఆర్ జనరల్ వార్డును సందర్శించి రోగులను పరామర్శించారు. ఎంజీఎం ఆస్పత్రి అంతా కలియతిరిగి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న వైద్య సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఎంత ఖర్చయినా సరే.. రోగులకు కావాలసిన అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అక్కడే ఉన్న వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ పర్యటనలో సీఎం కేసీఆర్ వెంట మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, సిఎస్ సోమేశ్ కుమార్, రిజ్వి, డీఎం ఈ రమేష్ రెడ్డి, ఓఎస్డీ గంగాధర్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, హెల్త్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు, సీపీ తరుణ్ జోషి, జిల్లాకు చెందిన పలువురు నాయకులున్నారు.

పదో తరగతి ఫలితాలు విడుదల

హైదరాబాద్ , మే 21: తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫలితాలను విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆన్‌లైన్‌లో ఫలితాలు అందుబాటులోకి రానున్నాయి. విద్యార్థులు bse.telangana.gov.in, bsetelangana.org వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చు.

కొవిడ్ నేపథ్యంలో ఈ ఏడాది వార్షిక పరీక్షల నిర్వహణ సాధ్యం కాకపోవడంతో ఫీజు చెల్లించిన 5,21,073 మంది విద్యార్థులను ఉత్తీర్ణులుగా పరిగణించారు. వీరిలో 2,10,647 మంది 10 జీపీఏ సాధించినట్లు మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. మొత్తం 535 పాఠశాలలు 10 జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-1) ఆధారంగా విద్యార్థులకు మార్కులు, గ్రేడ్లను ఖరారు చేసినట్లు స్పష్టం చేశారు.

విద్యార్థులు తమ మెమోలను ప్రధానోపాధ్యాయుల ద్వారా తీసుకోవచ్చని సూచించారు. విద్యార్థుల పాస్ మెమోల్లో ఏవైనా పొరపాట్లు తలెత్తితే ప్రధానోపాధ్యాయుల ద్వారా ఎస్ఎస్ఎస్సీ బోర్డుకు పంపితే వెంటనే సరిదిద్దుతామని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు భవిష్యత్‌లో మంచి కోర్సులను ఎంపిక చేసుకొని తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

క్రైసిస్ టైంలో ఆర్బీఐ అండ: కేంద్రానికి రూ.99,122 కోట్ల డివిడెండ్

ముంబై, మే 21: కరోనా సంక్షోభ సమయంలో నిధుల కొరతతో ఇబ్బందుల పాలవుతున్న కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ముందుకు వచ్చింది. భారీగా నిధులు సమకూర్చేందుకు సిద్ధమైంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2021-22) లో రూ. 99,122 కోట్ల మిగులు నిధులను డివిడెంట్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి ఆర్బీఐ చెల్లించనుంది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన బోర్డు సమావేశం ఆమోదముద్ర వేసింది.

కరోనావల్ల భారీగా ఆదాయం పడిపోవడంతో ఇబ్బందుల్లో కేంద్ర ప్రభుత్వం చిక్కుకున్న వేళ.. డివిడెండ్ రూపంలో ఆర్బీఐ అందించే నిధులు ఉపయోగపడనున్నాయి. కరెన్సీ ట్రేడింగ్, బాండ్ల ట్రేడింగ్ నుంచి ఆర్బీఐకి భారీగా ఆదాయం లభిస్తుంది.

ఈ ట్రేడింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత తన కార్య కలాపాలకు మినహాయించుకుని మిగతా నిధులను కేంద్ర ప్రభుత్వ ఆర్థిక అవసరాల కోసం అందజేస్తుంది. ఇప్పుడూ అలాగే రూ. 99,122 కోట్లను చెల్లించడానికి నిర్ణయించామని ఆర్బీఐ తెలిపింది.

గతేడాది కూడా కరోనా తొలి దశ సమయంలోనూ కేంద్రానికి ఆర్బీఐ డివిడెంట్ అందజేసింది. అప్పుడు మొత్తం మిగులు ద్రవ్యంలో 44శాతం అంటే రూ. 57వేల కోట్ల నిధులు చెల్లించింది. గత ఏడేండ్లలో ఆర్బీఐ చెల్లించిన అత్యంత తక్కువ డివిడెంట్ ఇదే.ప్రస్తుతం రెండో దశ కరోనా ప్రభావం ఉధృతంగా ఉంది. వైరస్‌ను కట్టడి చేయడానికి పలు రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్లు, ఆంక్షలు విధించాయి. దీంతో పలు వ్యాపారాలు మూతబడ్డాయి.

గతేడాది కరోనా సంక్షోభ పరిస్థితి నుంచి కాస్త తేరుకున్న దేశ ఆర్థిక వ్యవస్థపై తాజా ఆంక్షలు మరోసారి ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పాతబస్తీలో విషాదం.. ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

హైదరాబాద్ , మే 21: పాతబస్తీలోని హుస్సేనిఆలం పోలీసు స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. పీఎస్ పరిధిలోని పిట్టలోళ్ల బస్తీ పక్కన ఉన్న చంద్రకా పురంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ముగ్గురి ఆత్మహత్యలకు ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది. మృతుల బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు 21 కోట్లకు పైగా టీకాలు

న్యూఢిల్లీ, మే 21: కోవిడ్ మీద పోరులో భాగంగా భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సోకినవారీ ఆచూకీ కనిపెట్టటం, తగిన చికిత్స అందించటం, వ్యాప్తి నివారణకు తగిన జాగ్రత్తలు పాటింపజేయటం, టీకాలివ్వటం అనే ఐదు అంశాల ప్రాధాన్యంలో భాగంగా టీకాల మీద ప్రత్యేక దృష్టిసారించింది. దేశవ్యాప్త టీకాల కార్యక్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేస్తున్న కృషికి అండగా కేంద్రప్రభుత్వం కోవిడ్ టీకాలు ఉచితంగా అందజేస్తోంది.

అదే సమయంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు నేరుగా టీకాలు కొనుగోలు చేసుకునే వెసులుబాటు కూడా కల్పించింది.

సరళీకృత మూడో దశ టీకాల కార్యక్రమం మే 1న అమలు కావటం ప్రారంభం కాగా ఈ వ్యూహం కింద కేంద్ర ఔషధ ప్రయోగశాల (సిడిఎల్) ఆమోదం పొందిన టీకా మందు తయారీదారులనుంచి 50% మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొని ఇంతకు ముందు లాగానే రాష్ట్రాలకు ఉచితంగా అందజేస్తుంది.

భారత ప్రభుత్వం ఇప్పటిదాకా ఉచితంగానూ, రాష్ట్రాల ప్రత్యక్ష కొనుగోలు ద్వారా ఇప్పటిదాకా 21కోట్లకు పైగా టీకాలు (21,07,31,130) రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపింది. ఇందులో మొత్తం వాడకం (వృధాతో సహా) 19,09,60,575 డోసులుగా ఈ ఉదయం 8 గంటలకు అందిన సమాచారం ప్రకారం తెలుస్తోంది.

దాదాపు 2 కోట్ల (1,97,70,555) కోవిడ్ టీకా డోసులు ఇంకా ప్రజలకు ఇవ్వటానికి వీలుగా రాష్ట్రాల దగ్గర అందుబాటులో ఉన్నాయి.

అంతే కాకుండా దాదాపు 26 లక్షల (25,98,760) టీకా డోసులు పంపే ప్రయత్నం సాగుతోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు త్వరలోనే ఈ డోసులు అందుకుంటాయి.

కోవిడ్-19 కట్టడిలో ఆదర్శం నాందేడ్ జిల్లాలోని భోసి గ్రామం

న్యూఢిల్లీ, మే 21: కోవిడ్-19ని కట్టడి చేయడానికి నాందేడ్ జిల్లాలోని భోసి గ్రామం వినూత్న మార్గాన్ని అనుసరించి విజయం సాధించి దేశంలో అందరికి మార్గదర్శకంగా నిలిచింది. దేశంలో గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తూ కోవిడ్-19 కొత్త సవాళ్లను విసిరింది. దీనిపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ వ్యాప్తిని నివారించడానికి గ్రామీణ ప్రాంతాల ప్రజలను చైతన్యవంతులను చేసి పంచాయతీ రాజ్ సంస్థలు ముందుకు వచ్చి సహకరించాలని పిలుపు ఇచ్చారు.

పట్టణ ప్రాంతాలతో పోల్చి చూస్తే వైద్య సౌకర్యాలు తక్కువగా కలిగి పరీక్షలను నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు లేని గ్రామీణ ప్రాంతాల్లో కోవిడ్ వ్యాప్తిని అరికట్టడం క్లిష్టంగా ఉంటుంది. ఈ సమయంలో నాందేడ్ జిల్లా భొకర్ తాలూకాలోని భోసి గ్రామంలో అనుసరిస్తున్న విధానం అందరికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. కోవిడ్ ని కట్టడి చేయడానికి ఏకాంతంగా జీవించడమే మార్గంగా ఈ గ్రామ ప్రజలు ఎంచుకున్నారు.

రెండు నెలల కిందట గ్రామంలో వివాహ వేడుక జరిగిన తరువాత ఒక అమ్మాయికి వైరస్ సోకింది. వారం రోజుల తరువాత మరో అయిదుగురు వ్యక్తులకు వైరస్ సోకడంతో గ్రామంలో భయాందోళన పరిస్థితి ఏర్పడింది. దీనితో గ్రామ పంచాయతి, ఆరోగ్యశాఖ సహకారంతో జిల్లా పరిషత్ సభ్యుడు ప్రకాష్ దేశముఖ్ భోసికర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి కోవిడ్ పరీక్షలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. రాపిడ్ యాంటిజెన్ టెస్ట్ మరియు ఆర్టీ-పిసిఆర్ పరీక్షలలో 119 మంది కోవిడ్ 19 పాజిటివ్ అని తేలింది.

కోవిడ్-19 వ్యాప్తి చెందకుండా చూడడానికి వైరస్ సోకినవారిని విడిగా ఉంచాలని నిర్ణయించారు. కొద్దిపాటి వైరస్ లక్షణాలు ఉన్నవారికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ 15 నుంచి 17 రోజులు విడిగా (ఐసొలేషన్) జీవించాలని నిర్దేశించింది. దీనికి అనుగుణంగా గ్రామంలో వైరస్ సోకినవారు తమ పొలాల్లో ఉండేలా ఒప్పించడం జరిగింది. పొలాలు లేని కూలీలు ఇతరులు ఉండడానికి భోసికార్ తన సొంత పొలంలో 40 'లీ 60' షెడ్లను ఏర్పాటు చేశారు.

గ్రామ ఆరోగ్య కార్యకర్త ఆశటాయ్, అంగన్వాడి సేవిక ప్రతిరోజూ పొలాలను సందర్శించి రోగులతో మాట్లాడి వారికి అక్కడికక్కడే ఆహారం, మందులు కూడా అందించారు. దీనికి దాదాపు అందరూ సహకరించారు. 15 నుంచి 20 రోజుల ఐసొలేషన్ తరువాత గ్రామస్తులు ఆరోగ్యంగా ఇళ్లకు తిరిగి వచ్చారు. ఆరోగ్య పరీక్షల్లో వీరికి కరోనా లేదని తేలింది.

ఇది జరిగి 45 రోజులు అయ్యిందని ఇంతవరకు కొత్తగా ఎవరికి కరోనా సోకలేదని భోసికర్ తెలిపారు. పూర్వ కాలంలో వైద్య సౌకర్యాలు అందుబాటులో లేని సమయంలో విడిగా ఏకాంతంగా జీవించి ప్రజలు భయంకర ప్లేగు వ్యాధి నుంచి కూడ బయటపడ్డారని ఆయన వివరించారు.

గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యాధి బారిన పడకుండా చూడడానికి వారిని విడిగా ఉంచడం ఒక్కటే మార్గం' అని గ్రామ పొలాల్లో 15 రోజులపాటు ఐసొలేషన్ ఉన్న అని లక్ష్మీబాయి అకెమ్వాడ్ స్పష్టం చేశారు.

గ్రామ ప్రజల మధ్య సమన్వయం ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చునని చెప్పడానికి భోసి ఒక మంచి నిదర్శనమని నాందేడ్ జిల్లా పరిషత్ సిఇఒ వర్షా ఠాకూర్ ఘుగే అన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి పనిచేస్తే ఫలితాలు వుంటాయని అన్నారు. భోసి లో అమలు చేసిన విధానాన్ని అవసరమైన ఇతర ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని ఆయన సూచించారు.

పవర్‌గ్రిడ్ ద్వారా టీకాల కార్యక్రమం

న్యూఢిల్లీ, మే 21: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మహారత్న ప్రభుత్వ రంగ సంస్థ అయిన పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తన ఉద్యోగుల కోసం దేశంలోని వివిధ ప్రాంతాలలో టీకా శిబిరాలను నిర్వహిస్తోంది. కోటా, భివాడి, మిసా, నామ్సాయ్, రూర్కెలా, అరా, బిహార్షరీఫ్, సహర్సా, మరియు ముజఫర్‌పూర్ మొదలైన ప్రాంతాలలో టీకా శిబిరాలను ఏర్పాటు చేసింది. ఆయా శిబిరాలలో టీకాలు వేసే ఖర్చును పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ భరించింది. దేశంలోని వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో మే 10 -17 2020 వరకు టీకా డ్రైవ్ నిర్వహించారు. గురుగ్రామ్ సెక్టార్ 43లో మాక్స్ హాస్పిటల్ సహకారంతో మల్టీ పర్పస్ హాల్‌లో (ఎంపీ హాల్) 1600 మందికి పైగా వ్యక్తులకు టీకాలు వేశారు. టీకాలు తీసుకున్న వారిలో సంస్థ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, వయోవృద్ధులైన సంస్థ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. మాక్స్ హాస్పిటల్స్, ఫోర్టిస్ మరియు ఆర్టెమిస్‌ల సహకారంతో 2021 మార్చి 31 నుండి మే 6 వరకు గురుగ్రామ్‌లోని ఎంపీ హాల్‌లో నిర్వహించిన మరో టీకాల శిబిరంలో 700 మందికి పైగా టీకాలు వేయించుకున్నారు. ఢిల్లీలోని కట్వారియా సారాయ్ కార్యాలయంలో కూడా పవర్‌గ్రిడ్ సంస్థ ఒక టీకా శిబిరాన్ని నిర్వహించింది. ఇక్కడ దాదాపు 290 మందికి పైగా కోవిడ్-19 టీకా తీసుకున్నారు. ఇందులో విద్యుత్ మంత్రిత్వ శాఖ, ఇతర విద్యుత్ పీఎస్‌యులకు చెందిన 80 మందికి పైగా ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ శిబిరాన్ని అపోలో హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఎన్‌సీఆర్ పరిసర భూభాగంలో ఏర్పాటు చేసిన ఈ మూడు శిబిరాల్లో మొత్తం 2600 మందికి పైగా పవర్‌గ్రిడ్‌కు చెందిన వారు టీకా తీసుకున్నారు.

ఈ శిబిరాలు 18-44 సంవత్సరాల వయస్సు గల వారికి మరియు 45 ఏళ్లు పైబడిన వారికి కూడా టీకాలు వేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద టీకా డ్రైవ్‌ను పూర్తి చేయాలన్న భారత ప్రభుత్వఆలోచనకు పవర్‌గ్రిడ్ ఐక్యతతో తోడుగా నిలుస్తోంది.

2011 అర్జున అవార్డు గ్రహీత వి తేజస్విని బాయికి రూ .2 లక్షల సహాయం ఆమోదించిన క్రీడా మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, మే 21: 2011 లో అర్జున అవార్డును గెలుచుకున్న కర్ణాటకకు చెందిన వి తేజస్విని బాయికి రెండు లక్షల రూపాయలను సహాయంగా అందించాలన్న ప్రతిపాదనకు కేంద్ర యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. 2010, 2014 ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధించిన భారత జట్టులో తేజస్విని సభ్యురాలిగా ఉన్నారు.

కోవిడ్19 సమయంలో సమస్యలను ఎదుర్కొంటున్న మాజీ అంతర్జాతీయ క్రీడాకారులను ఆదుకోవడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ మరియు యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వశాఖలు సంయుక్తంగా క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జాతీయ సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయి. మే 1 న తేజస్విని మరియు ఆమె భర్త కోవిడ్ -19 బారిన పడ్డారు. కొద్దిగా దగ్గు ఉన్నప్పటికీ ఇంట్లోనే తేజస్వినికోలుకుంటున్నారు. తేజస్విని భర్త నవీన్ మే 11 న వైరస్ బారిన పడి మరణించారు. "నవీన్ వయస్సు 30 సంవత్సరాలే. తన తండ్రి మరణం తరువాత ఆయన ఆందోళనకి గురయ్యాడు . భయం మరియు ఒత్తిడికి గురై ఆయన ప్రాణాలు కోల్పోయాడు. "అని తేజస్విని పేర్కొన్నారు. ఆర్థిక సహాయంపై స్పందించిన తేజస్విని "నేను దీనిని ఊహించలేదు. కానీ క్రీడా మంత్రిత్వ శాఖ, సాయ్ మరియు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ స్పందించి ఈ సహకారాన్ని అందించాయి. మాకు ఇలాంటి సహకారం అందడం ఇదే మొదటిసారి. మాలో చాలా మందికి ఆర్థిక సమస్యలు ఉన్నాయి. మాకు సరైన సహాయం లభిస్తే ఆనందంగా ఉంటుంది "అని అన్నారు.

సారవంతమైన నేలలే దేశ అక్షయ పాత్రలు...!

(22 మే 'అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం' సందర్భంగా)

1960ల్లో నార్మన్ బోర్లాగ్ నాయకత్వంలో వచ్చిన హరిత విప్లవంతో వరి మరియు గోధుమ లాంటి పొట్టి పంటలను ఏళ్ల తరబడి సాగుచేయడంతో నేలలు నిస్సారమై ఎడారీకరణకు బీజాలు పడ్డాయి. 1970ల్లో వచ్చిన స్వల్పకాలిక వరి వంగడాల సాగుతో దిగుబడులు పెరిగినా, నాణానికి మరో వైపులా సారవంతమైన వ్యవసాయ నేలలు క్రమంగా నిస్సారమైన ఎడారులుగా మారే ప్రమాదపు అంచున ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీ, పంజాబ్, బీహార్ మరియు పశ్చిమ బెంగాల్ లాంటి గంగా పరివాహక ప్రాంతాల్లో 5 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ క్షేత్రాలు ఎడారీకరణకు చేరువలో ఉన్నాయని శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. భూగోళంపై ఉన్న నేలలో 40 శాతం వరకు నీటి వసతులు లేని బీడు భూములే (డ్రై లాండ్స్) ఉన్నాయని, ఈ భూముల్లో 2 బిలియన్ల ప్రజలు జీవిస్తున్నారని అంచనా. ప్రపంచవ్యాప్తంగా 12 మిలియన్ ఘనపు కిలోమీటర్ల శుష్క భూములు (అరీడ్ లాండ్స్) ఎడారీకరణకు లోనైనాయని, దాదాపు 20 శాతం బీడు భూములు క్షీణత(డీగ్రేడేషన్)కు గురి అయ్యాయని గణాంకాలు వివరిస్తున్నాయి. భూగోళంపై ఉన్న 20 శాతం నేలల్లో సగం వరకు ఎడారీకరణ ప్రమాదపు అంచున ఉన్నాయని, ప్రతి ఏటా 12 మిలియన్ హెక్టార్ల సారవంతమైన నేల ఎడారీకరణ ఉచ్చులో పడుతున్నదని తేలింది. ఈ అవాంఛనీయ సంక్షోభ ఫలితంగా 3 బిలియన్ల ప్రజలు ఆహార కొరతతో పేదరికంలోకి నెట్టబడడం జరుగుతున్నది. ఈ దుష్పరిణామాల వల్ల ఒక బిలియన్ ప్రజల ఆకలి చావులు పెరుగుతాయని పేర్కొనబడింది.

సహజ విపత్తులు లేదా మానవ కృత్రిమ కార్యాల వల్ల సారవంతమైన నేల నిర్వీర్యం మరియు నిస్సారం కావడాన్ని ఎడారీకరణగా పేర్కొంటారు. ఈ నేలలకు పోషకాలను అందిస్తూ, వెంటనే సారాన్ని అందించని యెడల వ్యవసాయ యోగ్యతను కోల్పోయి, వ్యవసాయ వినియోగానికి పనికి రాకుండా శుష్క భూములుగా మారిపోతాయని గమనించాలి. సకాలంలో స్పందించని యెడల కొంత కాలానికి నేల నాణ్యత నశించి, క్రమంగా వ్యవసాయ దిగుబడులు పూర్తిగా తగ్గి, శాశ్వతంగా కోలుకోలేని దుస్థితికి చేరుతూ ఎడారులను తలపిస్తాయి. నేలను అత్యాశతో సాగుకు వాడితే పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, జీవ వైవిధ్య వినాశనం మరియు అంటువ్యాధులు ప్రబలడం జరుగుతాయి. దీని పర్యవసానంగా నీటి కొరత, జీవన భృతి మరియు ప్రకృతి విపత్తులు కూడా చూడవచ్చు. వెంటనే మానవ సమాజం మేల్కొని ఎడారీకరణకు అడ్డుకట్టవేయని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తి పడిపోయి, 30 శాతం ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం, పేదరికం పెరగడం జరిగి, ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం వీలుకాని దుస్థితి వస్తుందని గమనించాలి. 2030 వరకు 350 మిలియన్ హెక్టార్ల నిస్సార ఎడారి భూముల నాణ్యతను పునర్ ప్రతిష్టాపన చేయడంతో దాదాపు 26 గిగా టన్నుల గ్రీన్‌హౌజ్ వాయువులు వాతావరణలోంచి తొలగించబడుతాయని అంచనా వేస్తున్నారు.

ఎడారీరకణను కట్టడి చేయడంతో వ్యవసాయ ఉపాధులు, అనుబంధ పరిశ్రమలు, పోషకాహార లభ్యత, నీటి లభ్యత, జీవ వైవిధ్య పరిరక్షణ పెరిగి వాతావరణంలో సకారాత్మక మార్పులకు పుణాది పడుతుంది.

కృత్రిమ ఎరువులు అధికంగా వాడడం , విచక్షణారహిత రసాయనాల వాడకం మరియు అధిక నీటి వినియోగంతో దిగుబడులు పెరిగి ఆహార భద్రత సుసాధ్యమైనప్పటికీ ఏకకాలంలో ఎడారీకరణ కూడా పెరగడం విచారకరం. నేలలోని సారాన్ని అనేక ఏండ్లుగా దురాశతో లాగుతూ, దిగుబడులను పెంచుకునే ప్రయత్నాలలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడంతో నేలలోని హిత సూక్ష్మజీవులు మరియు ఇతర జీవులు నశించడంతో సారవంతమైన నేలలు క్రమంగా నిస్సారమై ఎడారీకరణకు చేరువ కావడం చూస్తుండగానే జరిగిపోయింది. నేల ఎడారీకరణ, నేల కోత మరియు నేల నాణ్యతలో క్షీణతలు కాలక్రమంలో జరగడం వాస్తవ అనుభవంగా గుర్తిస్తున్నాం. అడవుల నరికి వేత, పచ్చిక బయళ్లు / చెట్టు చేమల్ని తొలగించడం, పశుగ్రాస వినియోగం, వ్యవసాయ క్షేత్రాల విస్తరణ, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ లాంటి మానవ ఆధునిక క్రియలు ఎడారీకరణను అనేక రెట్లు పెంచడం జరిగింది. అత్యాధునిక యంత్రాల వినియోగం, ఒకే రకమైన పంటలు వేయడం, నేల నాణ్యతను అతిగా పీల్చడం, నేల కాలుష్యం లాంటి కారణాలతో నాణ్యమైన నేలలు నిస్సారమై ఎడారులను తలపించుట ప్రారంభమైంది. ఆహార వ్యర్థాలను తగ్గించడంతో పాటు పంట మార్పిడి పద్ధతులు, పరిమిత పట్టణీకరణ, విచక్షణాయుత ఎరువులు/ పురుగు మందులు వాడకం లాంటి అనేక చర్యలు ఎడారీకరణను అడ్డుకుంటాయి. సారవంతమైన నేలలు మానవాళి ఉనికికి ప్రతిరూపాలని తెలుసుకొంటూ, గ్రీన్‌హౌజ్ వాయువులను నియంత్రిణ చేయడమే కాకుండా మె?క్కలు, జంతువులు మరియు మానవాళిని సుసంపన్నం చేయడానికి ఎడారీకరణకు ఆనకట్ట వేయబడుతుంది. మానవ కనీస అవసరాలైన కూడు, గుడ్డ మరియు గూడులను అందించుటలో సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయని, నేల సారాన్ని కాపాడడమంటే జీవన ప్రమాణాలను పెంచుకోవడమే అని భావిద్దాం. నాణ్యమైన మట్టి సువాసనను ఆశ్వాదిస్తూ, పిడికిళ్లోకి తీసుకొని ముద్దాడుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కోవిడ్ -19 పరిస్థితులపై రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడిన ప్రధానమంత్రి

హైదరాబాద్ , మే 21: ఈ సందర్భంగా అధికారులు , కోవిడ్ -19పై పోరాటంలో ప్రధానమంత్రి నాయకత్వానికి ఆయనకు ధన్యవాదాలు తెలిపారరరు. తమ తమ ప్రాంతాలలో కోవిడ్ పరిస్థితులు మెరుగుపడుతున్న తీరును అధికారులు ప్రధానమంత్రికి వివరించారు. రియల్ టైమ్ మానిటరింగ్, సామర్థ్యాల నిర్మాణానికి సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించిన తమ అనుభవాలను వారు ఆయనకు వివరించారు. తమ తమ జిల్లాలలో కోవిడ్‌పై అవగాహన పెంచేందుకు అలాగే ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు తీసుకున్న చర్యల గురించి కూడా వారు ప్రధానమంత్రి దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి, కోవిడ్ మహమ్మారిపై పోరాటంలో ప్రతి ఒక్కరూ పూర్తి అంకితభావం కలిగి ఉండాలన్నారు. కరోనా వైరస్ వర్కును మరింత డిమాండింగ్గా , ఛాలెంజింగ్గా మార్చ వేసిందని అన్నారు. ఈ కొత్త సవాళ్ళ నేపథ్యంలో నూతన వ్యూహాలు, కొత్త పరిష్కారాలు అవసరమన్నారు. గడచిన కొద్ది రోజులుగా దేశంలో కోవిడ్ యాక్టివ్ కేసులు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైందని అన్నారు. అయితే ఇన్‌ఫెక్షన్ అత్యల్ప స్థాయిలో ఉన్నప్పటికీ ఈ సవాలు ఉంటూనే ఉంటుందని ప్రధానమంత్రి హెచ్చరించారు.

కోవిడ్ మహమ్మారిపై పోరాటంలో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు సాగిస్తున్న అద్భుత కృషిని ప్రధానమంత్రి కొనియాడారు. వారి అనుభవాలు, స్పందనలు మరింత ఆచరణాత్మకమైన, పటిష్టమైన

విధానాల రూపకల్పనకు ఉపయోగపడినట్టు ప్రధానమంత్రి తెలిపాఉ. రాష్ట్రాలు, అన్నిస్థాయిలలోని వివిధ స్టేక్ హోల్డర్ల సలహాలను మిళితం చేసుకుంటూ వాక్సినేషన్ వ్యూహాన్ని ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని ఆయన అన్నారు.

స్థానిక అనుభవాలను ఉపయోగించుకోవాలని, దేశం అంతా ఒక్కటిగా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. గ్రామాలు కరోనా రహితంగా ఉండేలా సందేశాన్ని వ్యాప్తి చేయాలని, కోవిడ్ వ్యాప్తి నిరోధానికి తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలు పాటించేలా చూడాలన్నారు. కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ కోవిడ్ నిరోధానికి తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. గ్రామీణ , పట్టణ ప్రాంతాలకు ప్రత్యేకంగా వ్యూహాలు రూపొందించుకోవాలని, గ్రామీణ భారతదేశాన్ని కోవిడ్ రహితం అయ్యేలా చూడాలని ప్రధానమంత్రి కోరారు.

నిరంతర ఆవిష్కరణలు కొనసాగించాలని, మహమ్మారులను ఎదుర్కోవడంలో మన విధానాలను మార్చుకోవాలని ప్రతి మహమ్మారి మనకు బోధిస్తూ వచ్చిందని ప్రధానమంత్రి అన్నారు. వైరస్ మ్యుటేషన్‌లో, తన ఫార్మెట్‌ను మార్చుకోవడంలో నైపుణ్యం కలది కనుక కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడంలో మనం మన వ్యూహాలను , పద్ధతులను డైనమిక్ గా ఉండేలా చూసుకోవాలన్నారు.

వైరస్ మ్యుటేషన్ యువత, చిన్నారుల విషయంలో ఆందోళన కలిగించేదిగా ఉందన్నారు. వాక్సినేషన్ డ్రైవ్‌ను మరింత ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

వాక్సిన్ వృధా గురించి ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి, ఒక్క వాక్సిన్ వృధా కావడం అంటే ఒక వ్యక్తికి అవసరమైన భద్రత కల్పించలేకపోవడమే నని అన్నారు. అందువల్ల వాక్సిన్ వృధాను అరికట్టాలని ప్రధానమంత్రి కోరారు.

ప్రజల ప్రాణాలు కాపాడుతూ వారి జీవనాన్ని సులభతరం చేయడానికి ప్రాధాన్యతనిన్వాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. పేదలకు ఉచిత రేషన్ , ఇతర అత్యవసరాలు అందించేందుకు సదుపాయం కల్పించాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని కోరారు. కోవిడ్‌పై పోరాటంలో విజయం సాధించి ముందుకు సాగడానికి ఈ చర్యలు కూడా అవసరమని ఆయన అన్నారు.

ఎరువుల సబ్సిడీని ఒకసారికి పెంచుతూ రైతు అనుకూల చరిత్రాత్మక నిర్ణయం

ప్రకటించిన ప్రభుత్వం డిఏపి ఎరువుపై సబ్సిడీ 140 శాతం పెంపు

హైదరాబాద్ , మే 21: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, డిఏపి, ఇతర పి అండ్ కె ఎరువులకు ఒకసారికి సబ్సిడీని పెంచుతూ తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయానికి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ డి.వి.సదానంద గౌడ ఈరోజు ప్రధానమంత్రికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది లక్షలాదిమంది రైతులకు ప్రయోజనం కలిగించనున్నట్టు ఆయన తెలిపారు.

ఫాస్ఫాటిక్, పొటాసిక్ (పి అండ్ కె) ఎరువులను డీ కంట్రోల్ కింద ఉన్నందున తయారీదారులు తమ ఉత్పత్తుల ఎం.ఆర్.పి ధరను నిర్ణయించుకునే అధికారం కలిగి ఉన్నారరు. ఇటీవలి నెలల్లో అంతర్జాతీయంగా డిఏపి వంటి ఎరువుల ధరలు , దాని ముడి పదార్థమైన ఫాస్ఫారిక్ యాసిడ్, అమ్మోనియా, సల్ఫర్‌ల ధరలు సుమారు 60 నుంచి 70 శాతం పెరిగాయి. దీనితో దేశీయంగా వీటి ధరలపై ఒత్తిడి కల్పిస్తోంది. ఎరువుల కంపెనీలు డిఏపి ధరను 1900 రూపాయయల గరిష్ఠ చిల్లర ధర వద్ద అమ్ముతున్నట్టు ఏప్రిల్ లో వార్తలు వచ్చాయి. మార్చినెలతో పోలిస్తే ఇది ప్రతి బ్యాగ్‌కు 700రూపాయల ధర పెరుగుదల కింద లెక్క, అలాగే దేశీయంగా పి అండ్ కె ఎరువుల ధరలు కూడా సుమారు 50 శాతం పెరిగాయి. వ్యవసాయ కార్యకలాపాలకు ఎరువులు కీలకమైనది కావడంతో ధరల పెరగుదల రైతులకు ఇబ్బంది కరంగా మారింది.

దీనిని దృష్టిలో ఉంచుకుని , రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు , వారి కష్టాలను తీర్చేందుకు సకాలంలో , సానుకూల నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన 2021 మే 19న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో , ప్రధానమంత్రి, పి అండ్ కె ఎరువుల ధరలలో పెరుగుదల ఉండరాదని, ధరల పెరుగుదల భారాన్ని రానున్న ఖరీఫ్ సీజన్ కు ఒక సారి చర్యగా ప్రభుత్వం భరిస్తుందని ,ప్రకటించారు. ప్రస్తుత కోవిడ్ సమయంలో రైతుల కష్టాలు తీర్చేందుకు ఈ చర్య తీసుకున్నట్టు ప్రకటించారు..డిఏపి సబ్సిడీ రేటును బ్యాగ్ కు రూ 511 నుంచి రూ 1211 లకు పెంచారు. అంటే బ్యాగ్‌కు సబ్సిడీ 700 రూపాయలు పెంచారు. దీనితో డిఏపి ఎరువు రైతులకు గత సంవత్సరం నాటి ధర అయిన బ్యాగ్ రూ 1200 ల ధరకే అందుబాటులో ఉండనుంది. డిఏపి ఎరువు సబ్సిడీని 140 శాతం పెంచారు. ఇతర పి అండ్ క ఎరువుల ధరలు కూడా దాదాపు గత ఏడాది ధరకు అందుబాటులో ఉండనున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అదనంగా 14,775 కోట్ల రూపాయలను సబ్సిడీ కింద ఖర్చుచేయనుంది.

తుపాను తౌక్తే నేపథ్యంలో అన్వేషణ, సహాయ కార్యకలాపాల్లో నిమగ్నమైన త్రివిధ దళాలను, భారతీయ కోస్ట్‌గార్డును కొనియాడిన రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్

హైదరాబాద్ , మే 21: తుపాను తౌక్తే కారణంగా ప్రభావవతమైన ప్రాంతాలలో అన్వేషణ, సహాయ కార్యకలాపాలలో పాల్గొంటున్న భారతీయ కోస్ట్ గార్డు, సాయుధ దళాల కృషిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. సముద్రంలో చిక్కుకుపోయిన వ్యక్తుల ప్రాణాలను కాపాడినందుకు భారతీయ నావికాదళం, భారతీయ కోస్ట్ గార్డును అభినందించడమేకాక, ప్రభావితమైన ప్రాంతాలలో భారతీయ సైనిక దళాలను మోహరించినందుకు, జాతీయ విపత్తు స్పందనా దళాలు (ఎన్‌డిఆర్ఎఫ్) సిబ్బందిని రవాణా చేసినందుకు భారతీయ వైమానిక దళాలను ప్రశంసించారు.

తనకు నిత్యం పరిస్థితిని వివరిస్తున్న నావికాదళాధిపతి అడ్మిరల్ కరంబీర్ సింగ్, సైన్యాధ్యక్షుడు జనరల్ ఎంఎం నారావనే, వైమానికదళాధిపతి చీఫ్ మార్షల్ ఆర్‌కెఎస్ భదౌరియా, భారతీయ కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ కె.నటరాజన్‌తో రాజ్‌నాథ్ సింగ్ టచ్‌లో ఉన్నారు.

రానున్న తుపాను నేపథ్యంలో పౌర పాలనా అధికారులకు సాధ్యమైనంత సహాయాన్ని అందించవలసిందిగా సాయుధ దళాలను మే 17, 2021నాడు జరిగిన సమీక్షా సమావేశంలో ఆదేశించిన విషయం గమనార్హం. భారతీయ నావికాదళం (ఐఎన్), భారతీయ కోస్ట్‌గార్డ్ (ఐసిజి) తమ సముద్ర, వైమానిక దళాలను మోహరించి ముంబై తీరం వెంబడ గత కొద్ది రోజుల్లో నాలుగు నావల నుంచి 600మందికి పైగా వ్యక్తులను కాపాడారు. ముంబైకి 35 మైళ్ళ దూరంలో మే 17, 2021న మునిగిపోయిన అకామడేషన్ బార్జ్ పి-305 నుంచి కనిపించకుండా పోయిన 38మంది సిబ్బందిని వెతికేందుకు భారతీయ నావికాదళ నావలు, విమానాలు ప్రస్తుతం సెర్చ్ అండ్ రెస్క్యూ (అన్వేషణ, సహాయ -ఎస్ఎఆర్) కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు. ఐఎన్ఎస్ కొచ్చి, కోల్‌కతా, బియాస్, బేట్వా, టేజ్, పి81 సముద్ర నిఘా విమానం, చేతక్, ఎఎల్‌హెచ్, సీకింగ్ హెలికాప్టర్లు కూడా ఎస్ఎఆర్ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాయి. రక్షణ, సహాయ కార్యకలాపాలలో తోడ్పాటును అందించడం కోసం ఐఎన్ఎస్ తల్వార్‌ను మళ్ళించారు. బార్జ్ పి-305కి చెందిన 186మంది వ్యక్తులను సజీవంగా మే 20,2021న ఉదయం 7 గంటలకు కాపాడగా, 37 మృతదేహాలను రికవర్ చేశారు. గుజరాత్ తీర ప్రాంతంలో సపోర్ట్ స్టేషన్ 3కు , డ్రిల్ షిప్ సాగర్ భూషణ్ ఐఎన్ఎస్ తల్వార్ తోడ్పాటును అందించింది. ప్రస్తుతం వాటిని ఒఎ

రాజీవ్ గాంధీ ఆలోచనలు దేశానికి దిక్సూచి

-కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలి
-టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల మే, 21(నేటినిజం ప్రతినిధి): రాజీవ్ గాంధీ ఆలోచనలు దేశానికి దిక్సూచి అని, ఆయన ఆలోచనలే నేడు దేశాన్ని నడిపిస్తున్నాయనీ, రాజీవ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివనీ టీపీసీసీ ఆది శ్రీనివాస్ కొనియాడారు.కరోనా మహమ్మారి ని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ లో చేర్చాలనీ డిమాండ్ చేశారు.శుక్రవారం వేములవాడ తిప్పాపురం చౌరస్తాలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి టీపీసీసీకార్యదర్శి ఆది శ్రీనివాస్ నివాళులర్పించారు.అనంతరం ఈ సందర్భంగా ఆటో కార్మికులకు శానిటైజర్ లు, మాస్కులు పంపిణీ చేసి అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగాఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం నేడు రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ ఆలోచనలతో నడుస్తుందన్నారు.ఇందిరా, రాజీవ్ లు దేశానికి ఆదర్శమని, వారు చేసిన సేవలుమరువలేనివన్నారు.దేశం నేడు విపత్కర పరిస్థితినిఎదుర్కొంటోందనిదేశవ్యాప్తంగా కరోన మహమ్మారి ప్రబలి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరోన ని ఆరోగ్యశ్రీలో చేర్చాలని డిమాండ్ చేశారు.కరోనా చనిపోయిన కుటుంబాలకు పది లక్షల రూపాయలు ప్రభుత్వం ఎక్స్గ్రేషియా అందించాలని ఆయన కోరారు .ప్రతి ఒక్కరికీ వ్యాక్సినేషన్ అందించాలని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కరోనా మహమ్మారి అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయని ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవానితమకు తాము రక్షించుకోవాలని అన్నారు.ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నా రోగుల ఖర్చులను ప్రభుత్వమే భరించి వారికి చెల్లించాలని, దేశంలోని అన్ని రాష్ట్రాలు కరోనా ను ప్రభుత్వ పరంగా ఉచిత వైద్యం అందిస్తునీటే కానీ తెలంగాణలో మాత్రం ఎలాంటి పథకంలో చేర్చలేదనీ విమర్శించారు.

పక్కనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కరోనాను ఆరోగ్యశ్రీలో చర్చించిందని కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కరోనా మహమ్మారినీ ఆరోగ్య శ్రీ లో చేర్చి ప్రజలకు భద్రత కల్పించాలని ఆది శ్రీనివాస్ అన్నారు .ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి,కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ,అధికార ప్రతినిధి నాగుల విష్ణుప్రసాద్ ,కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమురయ్య, అరుణ్తేజ చారి, కనికరపు రాకేశ్ ,వస్తాదు కృష్ణ నరేష్ ,మామిడాల శ్రీకాంత్, కొలకాని రాజు ,సాబీర్ బాల బ్రహ్మం,మరి పెల్లి రాజు, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు .

కోనరావుపేట లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

రాజన్న సిరిసిల్ల మే, 21(నేటినిజం ప్రతినిధి): భారతదేశ మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకల కార్యక్రమాన్ని శుక్రవారం కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

నిర్వహించారు. ఏఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హోమ్ ఐసోలేషన్లో ఉన్న కరొనాబారిన పడిన వారికి కోడి గుడ్లు ,పండ్లు కూరగాయలుపంపిణీ చేశారు . అనంతరం .ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా మాట్లాడుతూ భారత దేశ ప్రధాన మంత్రిగా రాజీవ్ గాంధీ పనిచేసిన సమయంలోనే దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని, ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయసాధనకు తాము నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొట్టె రుక్మిని గ్రామ అధ్యక్షులు మందాల లింబయ్య మండల నాయకులు ఎల్లయ్య యాదవ్ శంకర్ ఇల్లందుల శివ కరణాల అజయ్ మారుపాక అజయ్ తదితరులు పాల్గొన్నారు,

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

-కొత్తపల్లిలో ధాన్యం కేంద్రం ఆకస్మిక తనిఖీ
పీహెచ్సీ సందర్శన

కొత్తపల్లి, మే 21: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెం చాలని కలెక్టర్ కే శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తపల్లి మండలకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని రైతులను కోరారు. కొనుగోలు కేంద్రా ల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏ ర్పాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు చేసిన వడ్ల వివరాలను వెంట వెంటనే ఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. అలాగే హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా తగిన ఏర్పా ట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్లాల్, తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఎండీ ఫక్రుద్దీన్, బండ గోపాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరోనా లక్షణాలు ఉన్న అనుమానితులందరికీ ని ర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ కే శశాంక వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పీహెచ్సీ పరిధిలో ఇంటింటికీ ఆరోగ్య పరీక్షల సర్వే వివరాలు, మెడికల్ కిట్ల పం పిణీ, వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాక్సినేషన్, కరోనా నిర్ధారణ పరీక్షలు వేర్వేరుగా నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలు, టెస్టింగ్ తీరును పరిశీలించారు. సెం టర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు గ్రామాలలో పర్యటించి లక్షణాలున్న వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. ప్రొగ్రామ్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పీహెచ్సీలో ఓపీ పరీక్షలతో పాటు సాధారణ వైద్య సేవలు, ముఖ్యంగా గర్భిణులకు నెలవారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే చామనపల్లిలో కరోనా ఓపీ సేవలను ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జువేరియా, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్రెడ్డి, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

బ్లాక్ ఫంగస్ వ్యాధి చికిత్స కోసం ఉపయోగించే యాంఫోటెరిసిన్-బి యాంటీ ఫంగల్ ఔషధ సరఫరా మరియు లభ్యతను పెంచడానికి భారత ప్రభుత్వం అన్ని చర్యలు

న్యూఢిల్లీ, మే 21: "హోల్ ఆఫ్ గవర్నమెంట్" విధానం ద్వారా కొవిడ్ 19 నిర్వహణ కోసం మందులు మరియు విశ్లేషణలను సేకరించడంలో భారత ప్రభుత్వం రాష్ట్రాలు మరియు యుటిలకు మద్దతు ఇస్తోంది. ఏప్రిల్ 2020 నుండి అవసరమైన మందులు, వైద్య పరికరాలు, పిపిఇ కిట్లు, మాస్క్లు మొదలైన వాటి యొక్క లభ్యతను పెంచేందుకు రాష్ట్రాలు మరియు యుటిలకు కేంద్ర ప్రభుత్వం ముందుగానే మద్దతు ఇస్తుంది.ఇటీవలి రోజుల్లో అనేక రాష్ట్రాలు మరియు యుటిల్లో కొవిడ్ సమస్యలతో బాధపడుతున్న రోగులు ముకార్మైకోసిస్ (బ్లాక్ ఫంగస్) బారిన పడుతున్నారు. అలాగే ఈ నేపథ్యంలో బ్లాక్ ఫంగస్ వ్యాధి చికిత్సకు ఉపయోగించే యాంటీ ఫంగల్ ఔషధమైన యాంఫోటెరిసిన్-బి కొరత ఉందని రాష్ట్రాలు, యుటిలు చెబుతున్నాయి.

యాంఫోటెరిసిన్-బి ఔషధ దేశీయ ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతో పాటు ఫార్మాస్యూటికల్స్ విభాగం మరియు విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) చురుకైన ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రపంచ తయారీదారుల నుండి సరఫరాను పొందడం ద్వారా దేశీయ లభ్యతను భర్తీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన ప్రయత్నాలు చేసింది.

ఈ సంస్థల ఉత్పత్తి సామర్థ్యం ఏప్రిల్ 2021 నెలలో చాలా పరిమితం చేయబడింది. భారత ప్రభుత్వం హ్యాండ్హోల్డింగ్ ఫలితంగా, ఈ దేశీయ తయారీదారులు మే 2021 లో యాంఫోటెరిసిన్-బి 1,63,752 వయల్స్ ఉత్పత్తి చేస్తాయి. జూన్ 2021 నెలలో అది 2,55,114 వయల్స్కు పెరుగుతాయి.

ఇది కాకుండా, దిగుమతి ద్వారా ఈ ఫంగల్ వ్యతిరేక ఔషధం యొక్క దేశీయ లభ్యతను భర్తీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మే 2021 లో యాంఫోటెరిసిన్-బి యొక్క 3,63,000 వయల్స్ దిగుమతి చేయబడతాయి. తద్వారా దేశంలో మొత్తం లభ్యత (దేశీయ ఉత్పత్తితో సహా) 5,26752 వయల్స్గా ఉంటుంది.

జూన్ 2021 లో 3,15,000 వయల్స్ దిగుమతి అవుతాయి. అందువల్ల, దేశీయ సరఫరాతో పాటు, దేశవ్యాప్తంగా యాంఫోటెరిసిన్-బి లభ్యత జూన్ 2021 లో 5,70,114 వయల్స్కు పెంచబడుతుంది.

ఈ కంపెనీలు జూలై 2021 నుండి నెలకు 1,11,000 యాంఫోటెరిసిన్-బి వయల్స్ను ఉత్పత్తి చేయటం ప్రారంభిస్తాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మరియు ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్మెంట్ కలిసి ఈ ఐదు తయారీదారులను ఉత్పత్తిలో కొంత భాగాన్ని ముందస్తుగా అందించడానికి ప్రయత్నిస్తున్నాయి. తద్వారా ఈ అదనపు సరఫరా జూన్ 2021 లో ప్రారంభమవుతుంది.

దీనికి మించి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎంఈఎ సహకారంతో ఇతర ప్రపంచ వనరులను కూడా చురుకుగా అన్వేషిస్తోంది. ఇక్కడ నుండి యాంఫోటెరిసిన్-బి ఔషధాన్ని దిగుమతి చేసుకోవచ్చు. బ్లాక్ ఫంగస్ చికిత్సలో ఉపయోగించే ఇతర యాంటీ ఫంగల్ ఔషధాలను సేకరించడానికి కూడా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రయత్నిస్తోంది.

సిబ్బందిపై సీపీ స్పెషల్ కేర్

-ప్రతి ఒక్కరికీ కరోనా టెస్ట్.. వ్యాక్సినేషన్
మాస్కులు, శానిటైజర్లు అందిస్తూ అప్రమత్తం

హన్మకొండ మే 21 : కరోనా కట్టడిలో పోలీసులు ఫ్రంట్లైన్ వారియర్లుగా ఉంటున్నా రు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందిస్తున్నారు. ముఖ్యంగా లాక్డౌన్ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్నారు. కొవిడ్ కొందర్ని బలితీసుకుంటున్నా విధి నిర్వహణే ప్రధాన కర్తవ్యంగా రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో సిబ్బంది ఆరోగ్యంపై పోలీస్ బాస్ స్పెషల్ కేర్ తీసుకుంటున్నారు. పోలీసులు కరో నా బారిన పడకుండా వరంగల్ పోలీస్ కమిషన ర్ తరుణ్జోషి ముందస్తు చర్యలు చేపడుతున్నా రు. కొవిడ్ చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశా రు. సిబ్బందికి అన్ని విధాలా అండగా ఉంటూ వారిలో భరోసా కల్పిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ జోన్ల ఏసీపీలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోజువారీగా మాట్లాడే సెట్ కాన్ఫరెన్స్లో సైతం ఇన్స్పెక్టర్లతో సిబ్బంది ఆరోగ్యం పై ఆరా తీస్తున్నారు. ప్రతి ఒక్కరూ కొవిడ్ టీకా లు వేసుకునేలా చొరవ చూపుతున్నారు.

ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రం

కరోనా సోకిన సిబ్బంది, వారి కుటుంబనభ్యుల కోసం ఆర్ఈసీ సమీపంలోని పున్నమి గెస్ట్హౌస్లో సీపీ ప్రత్యేక చొరవతో వారం క్రితం ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేయించా రు. అందులో బాధితులను నిత్యం పర్యవేక్షించేందుకు నిపుణులైన వైద్యులను అందుబాటు లో ఉంచారు. అవసరం ఉన్న వారికి ఆక్సిజన్తో పాటు భోజనం సౌకర్యం కల్పించారు.

అత్యవస ర సమయంలో దవాఖానలకు తరలించేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ఐసోలేషన్లో బాధితుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు ఆరా తీసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఏసీపీ నత్యనారాయణను ప్రత్యేకంగా నియమించారు. దాదాపు 20 మంది సిబ్బంది ఈ కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. రోడ్లపై రే యింబవళ్లు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కరో నా బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శానిటైజర్లు, మాస్కులు, షీల్డ్మాస్కులు పంపిణీ చేశా రు. సిబ్బందికి కొవిడ్ టీకాలు వేసేలా వైద్య ఆరోగ్యశాఖ సహకారాన్ని కోరుతున్నారు.

కరోనా బాధితులకు ప్రత్యేక అంబులెన్స్

-జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్ ,మే 21: ఆదిలాబాద్ పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో కరోనా బాధితుల కోసం ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేశారు. గురువారం కైలాస్నగర్లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా సోకిన వారు దవాఖానకు వెళ్లడానికి, కొవిడ్తో మృతిచెందిన వారిని తరలించడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 9515060231కు కాల్ చేస్తే సేవలు అందుతాయని తెలిపారు.

కరోనా సోకి ఇబ్బందులు పడుతున్న వారి కోసం ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గురువారం జెండా ఊపి అంబులెన్స్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో కరోనా సోకిన వారిని దవాఖానలకు తీసుకెళ్లడానికి ఎవ రూ ముందుకు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా అంబులెన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వాహనం కోసం టోల్ ఫ్రీ

నంబర్ 9515060231కు కాల్చేస్తే వారి ఇంటికి వెళ్లి దవాఖానలకు తీసుకెళుతందన్నారు.

కొవిడ్తో మరణించిన వారి శవాలను తరలించడానికి కూడా వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, భరత్కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ నరేందర్, దమ్మపాల్, రాంకుమార్, లక్ష్మణ్ , యూనిస్ అక్బానీ, నారాయణ,రాజు పాల్గొన్నారు.

లాక్డౌన్ నిబంధనలు పాటించాలి

మహబూబ్నగర్,మే 21: కరోనా నియంత్రణకు ప్రభుత్వం చేస్తున్న లాక్డౌన్ నిబంధనలను ప్రతిఒక్క రూ పాటించాలని ఎస్పీ రావిరాల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో లాక్డౌన్ పరిస్థితిని పర్యవేక్షించారు. క్లాక్టవర్లో రోడ్లపై తిరుగుతున్న వా హనదారుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తప్పుడు గుర్తింపు కార్డు పెట్టుకుని తిరుగుతున్న యువకుడిని గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చే యాలని వన్టౌన్ ఇన్స్పెక్టర్ను ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తప్పుడు గుర్తింపు కార్డులతో లాక్డౌన్ సమయంలో బయట తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణాల ముందు ప్రజలు గుమ్మికూడకుండా దుకాణాదారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. లాక్డౌన్, కొవిడ్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. లాక్డౌన్ మొదలైనప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా 4742మందిపై కేసులు న మోదు చేశామని, ఇకముందు మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించాలి

నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ రావిరాల వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసు అధికారులతో ఎస్పీ సమావేశమై శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మా ట్లాడుతూ కరోనా మహమ్మారి ని ర్మూలనకు పూర్తిస్థాయిలో శ్రద్ధ తీ సుకోవాల్సిన అవసరం ఉందన్నా రు. పోలీసు సిబ్బంది వ్యక్తిగతంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కనిపించని శత్రువు పై ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉంటూనే ప్రజల రక్షణ బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. లాక్డౌన్ ఉద్దేశాన్ని చాలావరకు ప్రజలు అర్థం చే సుకుని ఇండ్లల్లోనే ఉంటున్నారని, సడలింపు సమయంలో అనవసరంగా బయట తిరుగుతూ రద్దీ సృష్టించేవారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిందితులను అదుపులోకి తీసుకునే ప్రక్రియలో ఏమరుపాటు తగదని సూచించారు. దర్యాప్తులో ఉన్న పాత నేరాల్లో పురోగతి సాధించేందుకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆనాచారాలు, చిన్నచిన్న గొడవలు, యువత దురలవాట్లపై ప్రాథమిక స్థాయిలోనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది కు టుంబ సభ్యులందరికీ కొవిడ్ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్పీ ఎన్ వెంకటేశ్వ ర్లు, డీఎస్పీ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

కృష్ణపట్నానికి పోటెత్తిన జనం.. తలలు పట్టుకుంటున్న పోలీసులు

అమరావతి, మే 21: కరోనా చికిత్సకు ఆయుర్వేద ఔషధం కోసం నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నానికి జనం పోటెత్తుతున్నారు. జనాలు భారీగా తరలిరావడంతో అదుపు చేయలేక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. కృష్ణపట్నం నుంచి 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి.

మీడియా వాహనాలు సైతం ట్రాఫిక్లో చిక్కుకున్నాయి. ప్రస్తుతం అక్కడ 5 వేల మందికి మందు తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సుమారు 35 వేల మంది కృష్ణపట్నానికి చేరుకున్నట్లు తెలిసింది. వీరిలో ఎక్కువ మంది కొవిడ్ పాజిటివ్ రోగులు ఉన్నట్లు అధికారులు ఆందోళనలు వ్యక్తం చేశారు. ఊళ్లోకి వెళ్లేందుకు ఒకే దారి ఉన్నందున ప్రత్యామ్నాయ మార్గ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు.బొనిగి ఆనందయ్య అనే స్థానిక ఆయుర్వేద వైద్యుడు ఈ మందు పంపిణీ చేస్తున్నారు. ఆయుర్వేద గుణాలు కలిగిన ఆకులు, శొంఠి, మిరియాలు, తేనె, అల్లం, ధనియాలు వంటి వాటిని కలిపి లేహ్యం తయారు చేసి గతంలో స్థానికంగా అందజేశారు. ఈ ఆయుర్వేద మూలిక వ్యవహారం ప్రభుత్వ అధికారుల వరకు వెళ్లింది.దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం ఈ నాటు మందుపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. మందు తయారీలో వాడుతున్న మూలికలు, ఇతర వివరాలను ఆనందయ్యను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనుమతులు లేకపోవడంతో తయారీతోపాటు పంపిణీ ఆపేయాలని ఇటీవల ఆదేశించారు.

పుట్టిన రోజున కొవిడ్ బాధితులకు చేయూత

మహబూబాబాద్, మే 21 : ఎమ్మెల్యే బానోత్ శంకర్నాయక్ తన పుట్టినరోజు సందర్భంగా కరోనా బాధితులకు చేయూతనిచ్చారు. రూ. 5 లక్షల చెక్ను గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ వీపీ గౌతమ్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ? ప్రజాప్రతినిధులు, ఉన్నతవర్గాలకు చెందిన వారు కరోనా కష్టకాలంలో పేదలను ఆదుకునేం దుకు ముందుకురావాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే నెల్లికుదురు మండలంలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉదయమే జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కరోనా బాధితులు ధైర్యంగా ఉండాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలక్షేమం కోసం రాత్రీపగలు తేడా లేకుండా రహదారులను శుభ్రం చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది వందమందికి నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్నాయక్, సీతామహాలక్ష్మి దంపతులు జిల్లా కేంద్రం శివారు రాంచంద్రాపురం సమీపంలోని వేల్పులసత్యంనగర్ కాలనీలో దైవకృప అనాథాశ్రమంలోని పిల్లలకు అన్నదానం చేశారు. అనాథలంతా కలిసి శంకర్నాయక్కు మొక్కను బహుమతిగా అందజేశారు.

శంకర్నాయక్కు కేసీఆర్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే శంకర్నాయక్ పుట్టిన రోజు సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని దీవించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో కలిసి ఎంపీ జోగినపల్లి సంతోశ్కుమార్ విసిరిన గ్రీన్ చాలెంజ్లో భాగంగా మొక్కలు నాటారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్, ఎంపీ సంతోశ్కుమార్కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రామ్మోహన్రెడ్డి, ఫరీద్, యాళ్ల మురళీధర్రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి ఎమ్మెల్యేను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణలో వైద్య రంగం బలోపేతం

హన్మకొండ, మే 21: తెలంగాణ రాష్ట్రంలో వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు అన్నారు. గురువారం హన్మకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయం (ఆర్ అండ్ బీ గెస్ట్హౌస్)లో కలెక్టర్లు, వైద్యాధికారులు, టాస్క్ఫోర్స్ కమిటీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యరంగాన్ని బలోపేతం చేయడంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని, అం దులో భాగంగానే ఆరు మెడికల్ కళాశాలలు, వాటికి అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు, 12 ప్రాంతీయ ఔషధ ఉప కేంద్రాలు, 40 ప్రభుత్వ వైద్యశాలల్లో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. సీఎం తీసుకుంటున్న సాహసోసేత నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలకు భరోసా కలుగుతున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఆక్సిజన్, రెమిడెసివిర్ ఇంజక్షన్లు, మందుల కొరత లేదన్నారు.

కొవిడ్ బాధితులు ప్రభుత్వ దవాఖానల్లోనే చికిత్స పొందాలని మంత్రి కోరారు. ప్రైవేట్ వైద్యశాలల్లో చేరి ఆర్థిక ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. వరంగల్ ఎంజీఎం వైద్యశాలలో ఆక్సిజన్, మందుల కొరత లేదని తెలిపారు. మరో 275 ఆక్సిజన్ ఫ్లో మీటర్లు సమకూర్చామన్నారు. సీఎం చొరవతో ఎంజీఎం ఉద్యోగులు, సిబ్బందికి అన్ని వసతులు కల్పించనున్నామన్నారు. అలాగే దవాఖాన రూపు రేఖలు మార్చాలని సీఎం కేసీఆర్ ధృడ నిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొవిడ్ లక్షణాలు కనిపిస్తే ఏఎన్ఎం, ఆశ వర్కర్ల వద్ద ఉన్న కిట్లతో టెస్టులు చేయించుకోవాలని సూచించారు. అన్ని రకాల మందులతో కూడిన కిట్లు వారి వద్ద ఉన్నట్లు మంత్రి తెలిపారు.

ప్రజారోగ్యం బేష్

కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ బాగుందని మం త్రి ఎర్రబెల్లి తెలిపారు. రాష్ట్రానికి అవసరమయ్యే వ్యాక్సిన్లను కేంద్ర ప్రభుత్వం సరిగా ఇవ్వడంలేదని చెప్పారు. ప్రధాని మోదీకి గుజరాత్ తప్ప ఏ రాష్ట్రం కనిపించడంలేదన్నారు. గ్లోబల్ టెండర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వ్యాక్సిన్లను సేకరిస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ దవాఖానలను స్వయంగా పరిశీలించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని, అందులో భాగంగానే బుధ

ప్రైవేట్ హాస్పిటల్స్ మానవతా దృక్పథంతో సేవలందించాలి

మహబూబ్‌నగర్, మే 21: ప్రైవేట్ హాస్పిటల్స్ మానవతా దృక్పథంతో సేవలందించాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..20 శాతం బెడ్లను పేద కరోనా బాధితులకు ఉచితంగా.. లేదంటే నామమాత్రపు ఫీజుతో వైద్యం అందించాలన్నారు. సిటీ స్కానింగ్ రూ.1999 కే చేయాలని సూచించారు.

రెండు, మూడు దవాఖానల్లో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. అలాంటి పనులు మానుకోవాలి. లేదంటే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. మంత్రి సూచన మేరకు ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు అందరూ కలిసి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో వైద్య పరీక్షల రేట్లను ప్రకటించారు.

ప్రభుత్వానికి కేటాయించే 20 శాతం బెడ్లలో వసూలు చేసే చార్జీలు ఈ విధంగా ఉన్నాయి. ప్రాథమిక రక్త పరీక్షలు, మందులు కలిపి ఆరు రోజుల వైద్యం కోసం ఆక్సిజన్ లేకుండా వైద్య సదుపాయాలు కల్పించినందుకు గాను రూ.30,000 వేలుగా నిర్ణయించారు. అలాగే ఆక్సిజన్ పెట్టాల్సి వస్తే రూ.60,000 చెల్లించాలని వివరాలను వెల్లడించారు.

ధైర్యం కోల్పోవద్దు..నిర్లక్ష్యం చేయొద్దు

మహబూబాబాద్,మే 20: కొవిడ్ పాజిటివ్ రాగానే ఆందోళన చెందవద్దని, ధైర్యం కోల్పోకుండా సరైన చికిత్స తీసుకుంటే కొవిడ్ నుంచి కోలుకోవడం కష్టంకాదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. 104 ఏళ్ల ముసలమ్మ కూడా కొవిడ్ నుంచి కోలుకుందని చెప్పారు. జిల్లాలోని కొత్తగూడ, గంగారంలలో కొవిడ్ వార్డులను మంత్రి, జిల్లా జడ్పీ చైర్ పర్సన్ కుమారి బిందు, ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ఇతర అధికారులు, నేతలతో కలిసి సందర్శించారు.కొవిడ్ వార్డులలో ఉన్న వసతులు పరిశీలించారు. కొవిడ్ రోగులను పరామర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు పండ్లను పంపిణీ చేశారు. గ్రామాల్లో కొవిడ్ కట్టడి కోసం గ్రామ కమిటీలు చేస్తున్న పనిని ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో పంపించాలని ఆదేశించారు.

కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాద్

'అమృతోత్సవ భారతి' కవితా సంకలనం

కిన్నెర 130వ ప్రచురణ

సంపాదకులు గారికి

నమస్కారాలు.

ఈ క్రింద తెలిపిన విధంగా కవితా సంకలనానికి మీ సహకారం అందించండి. రచయితలు, రచయిత్రులకు మీ పత్రిక ద్వారా కింది వివరాలు అందించగలరని ఆశిస్తున్నాను.

1980లో "కిన్నెర పబ్లికేషన్స్" ప్రారంభించిన తరువాత నేటి వరకు సాహితీ సరస్వతికి నైవేద్యంగా అందించిన 129 గ్రంథాలను తెలుగు రసజ్ఞ లోకం ఎంతో ఆదరించింది.

75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా కిన్నెర 130వ ప్రచురణగా 'అమృతోత్సవ భారతి' కవితా సంకలనాన్ని 75 మంది ప్రముఖ కవుల కవితలతో ప్రచురించాలని సంకల్పించాము. ఈ గ్రంథం స్వాతంత్ర్య దినోత్సవ రోజు ఆగస్టు 15న ఆవిష్కరించడానికి నిర్ణయించాము.

మీ కవితలు దేశభక్తి, స్వాతంత్రోద్యమ సంఘటనలు, స్వాతంత్ర సమరయోధులకు సంబంధించినవై ఉండాలి. కవితలు 20 నుంచి 30 లైన్లకు మించరాదు.

'కిన్నెర' తలపెట్టిన ఈ పవిత్ర యజ్ఞానికి పదికాలాల పాటు భద్రపరుచుకునే విధంగా రూపొందుతున్న ఈ కవితా సంకలనానికి మీరు యథోచితంగా తోడ్పడగలరని ఆశిస్తున్నాం. మీ కవితను 15 జూన్, 2021 లోగా ఈ క్రింది చిరునామాకు పంపగలరని ఆశిస్తున్నాము.

కిన్నెర పబ్లికేషన్స్

2-2-647/153, ఫ్లాట్ నెం. 101&102, మద్దాళి గోల్డెన్ నెస్ట్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,

హైదరాబాద్ - 500 013 - ఫోన్ నెం: 9866057777

kinneraarttheatres@gmail.com

yagnyasri@gmail.com,

2 డోసుల ఆస్ట్రాజెనికా టీకాలతో 90 శాతం రక్షణ : బ్రిటన్

లండన్, మే 21: ఆస్ట్రాజెనికా కంపెనీకు చెందిన రెండు డోసుల టీకాలు వేసుకుంటే.. కోవిడ్ నుంచి సుమారు 90 శాతం రక్షణ ఉంటుందని ఇంగ్లండ్‌కు చెందిన ప్రజారోగ్య సంస్థ పేర్కొన్నది. దీనికి సంబంధించిన డేటాను పబ్లిక్ హెల్త్ శాఖ రిలీజ్ చేసింది. మే 9వ తేదీ నాటికి ఇంగ్లండ్‌లో 60 ఏళ్లు దాటినవారిలో.. సుమారు 13000 మరణాలను నియంత్రించ గలిగినట్లు ఆ దేశ ఆరోగ్య సంస్థ చెప్పింది. ఇక వ్యాక్సిన్లు ఇవ్వడం వల్ల 65 ఏళ్లు దాటినవారిలో సుమారు 40 వేల మంది హాస్పిటల్ ఇబ్బందుల నుంచి దూరమైనట్లు డేటాలో వెల్లడించారు. మహమ్మారి కరోనా వల్ల ఇంగ్లండ్ భారీ స్థాయిలో మరణాలు సంభవించాయి. కానీ వ్యాక్సినేషన్ ప్రక్రియ తర్వాత ఆ విపత్తు ఆగినట్లు తెలుస్తోందని పబ్లిక్ హెల్త్ పేర్కొన్నది.

కోవిడ్ 19 నుంచి వ్యాక్సిన్లు మన ప్రాణాలు కాపాడుతాయన్న విషయం తాజా డేటా స్పష్టం చేస్తున్నదని ఆరోగ్యశాఖ మంత్రి మ్యాట్ హాన్‌కాక్ తెలిపారు. కొత్త వేరియంట్లు దాడి చేస్తున్న తరుణంలో.. వ్యాక్సినేషన్ ప్రక్రియ చాలా కీలకమైందన్నారు. బ్రిటన్‌లో ఇప్పటి వరకు మూడవ వంత జనాభాకు వ్యాక్సిన్లు ఇచ్చారు. వీలైనంత వరకు ఫస్ట్ డోసును ఇచ్చేశారు. ఇక రెండవ డోసు కోసం మాత్రం 12 వారాల గడువును విధించారు. వ్యాక్సిన్ల మధ్య గడువును పెంచడం వల్ల.. శరీరంలో వైరస్‌కు వ్యతిరేకంగా ఉత్పత్తి అయ్యే యాంటీబాడీలు 20 నుంచి 300 శాతం వరకు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తాజా సర్వే అభిప్రాయపడింది. ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ శాస్త్రవేత్తలు డెవలప్ చేసిన కోవిడ్ టీకాలను ఆస్ట్రాజెనికా ఉత్పత్తి చేస్తున్నది. అయితే ఆ టీకాలనే కోవీషీల్డ్ పేరుతో ఇండియాలో సీరం సంస్థ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే.

అధైర్యపడవద్దు.. అండగా ఉంటా

గోదావరిఖని, మే 21: కరోనా బాధితులు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే భరోసాయాత్రలో భాగంగా ఎన్టీపీసీలోని ఐదో డివిజన్‌లో కరోనా బాధితుల ఇంటికి చందర్ వెళ్లి ఆత్మీయంగా పలుకరించి, వారికి నిత్యావసరాలు, వండ్లు, పౌష్టికాహారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కరోనా కట్టడికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. గోదావరిఖని సప్తగిరి కాలనీలో కరోనా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. ఇండ్లలో ఉండలేని బాధితులకు కేర్ సెంటర్‌లో విజయమ్మ ఫౌండేషన్ ద్వారా మూడు పూటలు భోజనం అందిస్తున్నామని, అంబులెన్స్ వసతి, కరోనా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ మేయర్ బింగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్ కల్వచర్ల క్రిష్ణవేణి ఉన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ, మే 20: రామగుండం 14వ డివిజన్‌లో కరోనా బాధితులకు ఎమ్మెల్యే మనోధైర్యం కల్పించేందుకు భరోసా యాత్ర చేపట్టారు. నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇక్కడ కార్పొరేటర్ నీల పద్మగణేశ్ ఉన్నారు. కరోనాపై కూరగాయల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సూచించారు. గోదావరిఖని సీతానగర్ ఏరియాలోని కూరగాయల మార్కెట్‌ను గురువారం చందర్, సీపీ సత్యనారాయణతో కలిసి లాక్‌డౌన్ అమలు విధానం పర్యవేక్షించి వ్యాపారులకు లాక్‌డౌన్ నిబంధనలు, కరోనా వ్యాప్తి నివారణ విషయంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ కరోనా కట్టడిలో భాగస్వాములు కావాలన్నారు. మార్కెట్ చిన్నగా ఉన్న కారణంగా గతంలో మాదిరిగానే జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియానికి తరలిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, డీసీపీ రవీందర్, ఏసీపీ ఉమేందర్, ట్రాఫిక్ ఏసీపీ బాలరాజ్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, వన్ టౌన్ సీఐ రమేశ్‌బాబు, రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఏపీలో కొత్తగా 20,937 కరోనా కేసులు, 104 మంది మృతి

అమరావతి, మే 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరోనా ఉధృతి కొనసాగుతూనే ఉంది. గడిచిన 24 గంటల్లో ఏపీలో కొత్తగా 20,937 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా కొవిడ్-19తో 104 మంది మృతిచెందారు. తాజా కేసులతో కలుపుకుని ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 15,42,079కి చేరింది. వీటిలో యాక్టివ్ కేసుల సంఖ్య 2,09,156గా ఉంది. కొవిడ్‌తో ఇప్పటివరకు మృతిచెందినవారి సంఖ్య 9,904కి చేరింది.

గత 24 గంటల్లో జిల్లాల వారీగా కొవిడ్‌తో మృతిచెందినవారి వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో అత్యధికంగా 15 మంది మృతిచెందగా, ప్రకాశం, విజయనగరంలో 10 మంది చొప్పున, తూర్పుగోదావరి, నెల్లూరు, విశాఖపట్నంలో 9 మంది చొప్పున, అనంతపురం, గుంటూరు, కర్నూలు, శ్రీకాకుళంలో ఏడుగురు చొప్పున, పశ్చిమ గోదావరిలో ఆరుగురు వ్యక్తులు చనిపోయారు.

తౌక్టే తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చురుగ్గా చర్యలు

న్యూఢిల్లీ, మే 21: తౌక్టే తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో వీలైనంత ఎక్కువగా సహాయాన్ని అందించడానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ (కార్యదర్శి, విద్యుత్) రాష్ట్ర విద్యుత్ వినియోగాలు, పీజీసీఐఎల్, ఆర్ఈసీ, పోస్కోలతో క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలను నిర్వహిస్తోంది.

తౌక్టే తుఫాను కారణంగా అత్యధిక ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న గుజరాత్ మరియు కేంద్ర పాలిత ప్రాంతమైన దయ్యూలలో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసే ఉద్దేశ్యంతో విద్యుత్ శాఖ కార్యదర్శి గురువారం ఒక ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారిలో పీజీసీఐఎల్ సంస్థ సీఎండీ, ఏసీఎస్ ఎనర్జీ గుజరాత్, ఐఈఈఎంఏ అధ్యక్షులు తదితరులున్నారు. పది 220 కేవీ టవర్లను భర్తీ చేయగల సామర్థ్యం కలిగిన ఈఆర్ఎస్-ఎమర్జెన్సీ రిస్టోరేషన్ సిస్టమ్‌తో మొత్తం 150 మందికి పైగా అనుభవజ్ఞులైన మానవ శక్తితో కూడిన..

ఒక బృందం గుజరాత్‌కు చేరుకున్నట్లుగా పీజీసీఐఎల్ తెలియజేసింది. ఈ బృందం కేంద్ర పాలిత ప్రాంతం దయ్యూకు విద్యుత్ సరఫరాను అందించే 220 కేవీ విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించే పనిని ప్రారంభించినట్టుగా పీజీసీఐఎల్ తెలిపింది. 66 కేవీ వ్యవస్థ యొక్క పునరుద్ధరణ పనుల కోసం సంప్రదించగల కాంట్రాక్టర్ల జాబితాను పీజీసీఐఎల్ అందుబాటులో ఉంచింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి ట్రాన్స్మిషన్ లైన్ల నిర్మాణంలో పాల్గొన్న ఎలక్ట్రికల్ పరికరాల తయారీదారులు, ప్రధాన కాంట్రాక్టర్లతో సమన్వయం చేస్తామని ఐఈఈఎంఏ హామీ ఇచ్చింది. విద్యుత్ పునరుద్ధరణ పనులకు అవసరమైన సామగ్రి మరియు మానవశక్తిని అందిస్తామని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే హామీ ఇచ్చాయి.

రోడ్డు వెడల్పు పనులను పరిశీలించిన మంత్రి అల్లోల

ఆదిలాబాద్,మే 21: నిర్మల్ పట్టణం బస్ స్టాండ్ ముందు అంబేద్కర్ చౌరస్తా వద్ద జరుగుతున్న రోడ్డు వెడల్పు, అభివృద్ధి పనులను శుక్రవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరిశీలించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను పాదయాత్ర చేసి దగ్గరుండి పరిశీలించారు. మురికి కాలువల నిర్మాణం, ఫుట్ పాత్ రెలింగ్, ఆటో స్టాండ్, నాగమాత ఆలయం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు.రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. అతి త్వరలోనే పనులన్ని పూర్తయి నిర్మల్ పట్టణానికి మరింత శోభ రానుందన్నారు. జాతీయ జెండా ప్రాంతంలో పార్కు ను ఏర్పాటు చేస్తామని, బస్టాండ్ ప్రాంతంలో సమీకృత వ్యవసాయ మార్కెట్ ను నిర్మించనున్నామని మంత్రి తెలిపారు.

కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, లైబ్రరీ చైర్మన్ ఎర్రపోతు రాజేందర్, ఎఫ్ఎన్‌సీఎస్ చైర్మన్ ధర్మజి రాజేందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, విప్ నేరేళ్ల వేణు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత సీటు నుంచే మమత పోటీ.. రాజీనామా చేసిన పార్టీ ఎమ్మెల్యే

కోల్‌కతా, మే 21: తాను నాయకత్వం వహిస్తున్న తృణమూల్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి తను ఓడిపోవడం మమతా బెనర్జీకి ఒకకంట కన్నీరు మరొక కంట ఆనందబాష్పాలు తెప్పించే విషయం. సహాయకుడుగా ఉంటూ అదను చూసుకుని బీజేపీలోకి జంప్ చేసిన సువేందు అధికారికి గుణపాఠం చెప్పేందుకు ఆమె బెంగాల్ టైగర్‌లా ముందుకురికి నందిగ్రాం నుంచి పోటీ చేశారు. హోరాహోరీ పోరులో నాటకీయ పరిణామాల మధ్య ఆమె ఓడిపోయారు. వరుసగా మూడోసారి బెంగాల్ కోటలో పాగా వేసిన నాయకురాలికి ఆ ఓటమి బాధాకరమే. అయినప్పటికీ ఆమె బెంగాల్ సీఎం పదవి చేపట్టారు. నిబంధనల ప్రకారం మమత ఆరుమాసాల్లోపు అసెంబ్లీకి ఎన్నిక కావాలి. తన పాత నియోజకవర్గమైన కోల్‌కతాలోని భవానీపూర్ నుంచే ఆమె అసెంబ్లీకి పోటీచేయబోతున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆ స్థానంలో తృణమూల్ అభ్యర్థిగా శోభన్‌దేబ్ చటోపాధ్యాయ పోటీచేసి గెలిచారు. పార్టీ అధినేత్రి కోసం ఆయన ఆ సీటుకు రాజీనామా చేశారు. శుక్రవారం మధ్యాహ్నమే ఆయన తన రాజీనామా లేఖను స్పీకర్ బిమాన్ బంధోపాధ్యాయకు అందజేశారు. ప్రస్తుతం శోభన్‌దేబ్ వ్యవసాయ మంత్రిగా ఉన్నారు. ఆయన కూడా ఆరునెలల్లోగా మరో నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నిక కావాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే కాని వ్యక్తి మంత్రి పదవి చేపడితే ఆరుమాసాల్లోగా ఎన్నిక కావాలి లేదా రాజీమానా చేయాలి అని రాజ్యాంగంలోని 164వ అధికరణం చెప్తున్నది.

మానవత్వాన్ని చాటిన సీఐ రమేష్ కుమార్

వరంగల్ అర్బన్ : పోలీసులంటే క్రౌర్యమే కాదు. ఆర్ద్రతతో కూడిన హృదయాలను కలిగి ఉంటారని కొన్ని సంఘటనలు రుజువు చేస్తుంటాయి. లాఠీలు పట్టిన చేతులతోనే ప్రేమ హస్తాలను చాచి ఆపత్కాలంలో అండగా ఉంటారు. అలాంటి ఓ మానవీయ సంఘటన వరంగల్ నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..శాయంపేట రూరల్ సీఐ రమేశ్ బాబు సీఎం బందోబస్తులో భాగంగా ఎంజీఎం హాస్పిటల్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు.

ఈ క్రమంలో ఓ వృద్ధురాలు అనారోగ్యంతో అవస్థపడుతూ ఎటూ కదలలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నది. గమనించిన సీఐ కరోనా అని కూడా లెక్క చేయకుండా మానవీయంగా స్పందించాడు.

ఆ వృద్ధురాలిని తన చేతులతో ఎత్తుకొని ఆటో ఉన్న స్థలానికి ఎత్తుకొని పోయి చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు పంపించాడు. సీఐ సహృదతయను చూసి పరకాల ఏసీపీ శ్రీనివాస్ అభినందించగా పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కరోనా పేషెంట్లకు అండగా ఉంటాం

-మై వేములవాడ వాట్సాప్ గ్రూప్ సభ్యులు

రాజన్న సిరిసిల్ల మే, 21(నేటినిజం ప్రతినిధి): ఐసోలేషన్ ఉన్న కరోనా పేషెంట్లు భయపడాల్సిన పని లేదని వారికి అన్ని రకాలుగాసహాయం చేయడానికి అండగా ఉంటామని మై వేములవాడ వాట్సాప్ గ్రూప్ సభ్యులు అన్నారు శుక్రవారం మై వేములవాడ వాట్సప్ గ్రూప్ ఆధ్వర్యంలో నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా వేములవాడ లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ లో ఉన్న ఐసోలేషన్ సెంటర్లో కరోనా పేషెంట్లకు ,అలాగే డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందికి ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లలనుసమకూర్చారు .

ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు మాట్లాడుతూకరోనా పాజిటివ్ వచ్చినవారు భయపడాల్సిన పని లేదని ఐసోలేషన్ సెంటర్ లో ఉంటూ ప్రభుత్వం ఇచ్చిన మందులు వాడుకుంటూ మంచి ఆహారం తీసుకుంటూ ఉంటే కరోనా తగ్గుతుందని ఎలాంటి ఆందోళన అవసరం లేదని అన్నారు.

ఐసోలేషన్ సెంటర్లో లోని కరోనా పాజిటివ్ , వైద్య సిబ్బందికి లాక్డౌన్ ఉన్నంతవరకు మై వాట్సాప్ గ్రూప్ సభ్యుల ద్వారా ప్రతిరోజూ అల్పాహారం భోజనం సమకూరుస్తామని అన్నారు .కరోనా పాజిటివ్ వచ్చిన వారికి ప్రతి ఒక్కరు మన దృక్పథంతో ఆలోచించి వారికి సహాయం చేయాలని వారు సూచించారు.కరోనా తగ్గేంతవరకు మాస్కు ధరిస్తూ సామాజిక దూరం పాటిస్తూ ప్రతి ఒక్కరు జాగ్రత్త పాటించాలని అన్నారు. ప్రజలు నిర్లక్ష్యంగా ఉండకూడదు అని నిర్లక్ష్యంగా ఉంటే కరోనా పట్ల భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు కుమ్మరి శంకర్ , మధు మహేష్, డాక్టర్ రవీందర్ , ఓడా? లవేణు, నూగురి మహేష్, రంగుల శ్రీనివాస్ , సంకెపల్లి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ పట్టణంలోని కూరగాయల మార్కెట్ తాత్కాలికంగా 2వ బైపాస్ గంగమ్మ గుడి వద్దకు తరలింపు

-ప్రజలు సహరించాలని కోరిన మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ రావు, పట్టణ సీఐ వెంకటేష్

రాజన్న సిరిసిల్ల మే, 21(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం లో కరోనాని నియంత్రించటానికి ప్రస్తుతం వున్న పాత కూరగాయల మార్కెట్ మరియు కోరుట్ల బస్టాండ్ వద్ద వున్న కూరగాయల మార్కెట్ లను తాత్కాలికంగా 2వ బైపాస్ గంగమ్మ గుడి వద్దకు మార్చినట్టు మున్సిపల్ కమిషనర్ మరియు పట్టణ ఇన్స్పెక్టర్ తెలిపారు. కూరగాయలు అమ్మేవారు ఇకనుండి తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా అక్కడే అమ్ముకోవాలి అని ఆదేశాలు పాటించి సహకరించాలి అని,కూరగాయలకు వెళ్లే వారు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి, గుంపులు గుంపులుగా ఉండకూడదు. లాక్ డౌన్ ముగిసేంత వరకు ప్రజలు సహకరించాలని సూచించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.